ఆలయాలకు కార్తిక శోభ

- నేడు తొలి సోమవారం పూజలు
- కైకలూరులో ఒకే ప్రాంగణంలో మూడు శివాలయాలు
- నియోజకవర్గంలో పురాతన శివాలయాలు కొలువు

కైకలూరు: శివాలయాల్లో కార్తికమాస శోభ కనిపిస్తోంది. మొదటి కార్తిక సోమవార పూజలకు సర్వం సిద్ధమయ్యింది. శనివారం ప్రారంభమైన కార్తిక మాసం డిసెంబరు 2న జరిగే పోలీస్వర్గం కార్యక్రమంతో ముగియనుంది. శివాలయాల్లో కార్తిక మాస మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శివమాలధారణలు కూడా ప్రారంభించారు.

నాలుగు సోమవారాలు..
కార్తికమాసంలో నాలుగు సోమవారాలు పలు శివాలయాల్లో రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, జ్యోతిర్లింగార్చనలు, జ్వాలాతోరణాలు, శిఖర దీపారాధనలు, సహస్ర దీపోత్సవాలు, అభిషేకాలు, శాంతి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 15న కార్తిక పౌర్ణమి కావడంతో శివాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

శివపూజకు సిద్ధం..
నియోజకవర్గంలోని మండలాల్లో శివాలయాలు కొలువై ఉన్నాయి. దేవదాయశాఖ ఆధ్వర్యంలో కైకలూరు మండలంలో కనకలింగేశ్వస్వామి (ఆటపాక), మల్లేశ్వరస్వామి (ఆలపాడు), కలిదిండిలో రాజలింగేశ్వరస్వామి, నాగేశ్వర స్వామి (పెద లంక), పరమానందేశ్వరస్వామి (పోతుమర్రు), సోమేశ్వర స్వామి (కోరుకొల్లు), మండవల్లిలో మల్లేశ్వర స్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి (లింగాల), సోమేశ్వరస్వామి (అప్పాపురం), ముదినేపల్లి మండలంలో అమృతేశ్వస్వామి (సింగరాయపాలెం), సోమేశ్వరస్వామి (అల్లూరు), రామలింగేశ్వరస్వామి (గురజ), విశ్వేశ్వరస్వామి (వడాలి) శివాలయాలు ఉన్నాయి. ఇవే కాకుండా గ్రామస్తుల ఆధ్వర్యంలో పలు శివాలయాల్లో కార్తిక మాసోత్సవాలు జరుగుతున్నాయి.

ఇక్కడ విశిష్టత ఇదే..
రాష్ట్రంలో అమ్మవారి దేవాలయం ఒకే ప్రాంగణంలో మూడు శివాలయాలు కైకలూరులో ఉండటం ఓ ప్రత్యేకత. ఇక్కడ రామేశ్వర, రామలింగేశ్వర, కనకలింగేశ్వర శివాలయాలు పక్కపక్కనే ఉంటాయి. అదే విధంగా కలిదిండిలో పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి దేవాలయం రాజరాజ నరేంద్రుడి కాలంలో నిర్మించారు. కొల్లేటికోట సమీప గోకర్ణపురంలో గోకర్ణేశ్వరస్వామి శివాలయం వేంగి రాజుల కాలంలో నిర్మించారు.



మూడు శివాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్న కైకలూరు శ్యామలాంబ దేవాలయం



కైకలూరు మండలం గోకర్ణపురంలో గోకర్ణేశ్వరస్వామి

కార్తికమాసం శివుడికి ఇష్టం..



శివుడికి కార్తికమాసం అంటే ఎంతో ప్రీతి. కృత్తిక నక్షత్రంలో పౌర్ణమి రావడంతో కార్తిక పౌర్ణమి అంటారు. కార్తికమాసం అంతా ఆకాశ దీపాన్ని వెలిగిస్తారు. మహిళలు ఒత్తులతో దీపాలు వెలిగించి స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు.
– చావలి శంకరశాస్త్రి, అర్చకుడు, శివాలయం కైకలూరు

ఏర్పాట్లు పూర్తి..



పాతాళ భోగేశ్వరస్వామి శివాలయంలో కార్తిక మాస పూజలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి సోమవారం మహిళలు ఎక్కువ సంఖ్యలో స్వామివారికి అభిషేకాలు చేస్తారు. కోరుకొల్లు శివాలయం లోనూ కార్తికమాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశాం.
– వీఎన్‌కే శేఖర్, ఈవో, పాతాళ భోగేశ్వరస్వామి దేవాలయం, కలిదిండి

ఆలయాల్లో కార్తిక పూజలు

మండవల్లి: మండలంలోని దేవాలయాల్లో ఆదివారం కార్తికమాస పూజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారి రుద్రవరం, శోభనాద్రిపురం విశ్వేశ్వరస్వామి ఆలయాలు, మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయాలో ఆయా ఆలయాల అర్చకులు పూజలు నిర్వహించారు.

పమిడిముక్కల: ఐనంపూడి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వేణుగోపాలస్వామి దేవస్థాన ప్రాంగణలో ఆదివారం ఉసిరిచెట్టుకు కార్తిక దామోదర పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను సత్కరించారు. కార్తిక వనసమారాధనలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి, స్వామికి సమర్పించారు. కార్తీకమాసం మొదటి ఆదివారం కావడంతో పలువురు మాలధారులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

క్లుప్తంగా

కొండలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం ఆలయ ప్రాంగణం అధిక సంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తగు ఏర్పాట్లు చేశారు.

సమాచార కేంద్రం ఏర్పాటు
శ్రీ కొండలమ్మ అమ్మవారి భక్తుల సౌకర్యార్థం సమాచార కేంద్రాన్ని ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేశారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. అమ్మవారి సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఈ కేంద్రంలో తమ సిబ్బంది అందిస్తారని ఆయన చెప్పారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన




మండవల్లి: మండలంలోని పెరికేగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పీఆర్ ఏఈ కమలేశ్వరరావు కొలతలు తీశారు. స్థానిక ప్రాథమిక పాఠశాల నుంచి బాదిన వెంకన్నబాబు ఇంటి వరకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.6 లక్షలతో 60 మీటర్ల రోడ్డు నిర్మాణం చేస్తున్నారు.

సామాజిక అభివృద్ధికి కృషి చేద్దాం



గుడివాడ టౌన్: కాపు సామాజిక వర్గ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని గుడివాడ కాపు సేవా సమితి నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక కాపు కల్యాణ మండపంలో కాపు సేవా సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు నరహరిశెట్టి ప్రసాదు, ఆత్మూరి మల్లేశ్వరరావు మాట్లాడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 17న కార్తిక వన సమారాధన, 24వ తేదీ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలని సమావేశం తీర్మానం చేసిందన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ సూర్యతో పాటు సేవాసమితిలో 10 మంది నూతన సభ్యులను చేర్చుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి కోశాధికారి, సీహెచ్ రామారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు పి.రామకృష్ణ, సభ్యులు సాయిన గాంధి, బందారు నోబుల్‌నాయుడు, ఎస్.పూర్ణచంద్రరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి వెండి నాగపడగ వితరణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సూర్యారావుపేటకు చెందిన మాకినేని వెంకట విజయ కుమార్ దంపతులు వెండి నాగపడగను ఆదివారం సమర్పించారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం 950 గ్రాముల బరువుగల వెండి నాగ పడగను స్వామివారికి కానుకగా ఆలయ డెప్యూటీ కమిషనర్ డీఎస్ఆర్ వరప్రసాదరావుకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

ఉన్నత చదువులకు ఆర్థిక సాయం

పెడన: పట్టణంలోని 23 వార్డుకు చెందిన పేరక శంకర్ రావు కుమార్తె సాయి హర్షిత ఉన్నత చదువులకు ఏలూరుకు చెందిన దేవాంగ ప్రముఖుడు కొండపల్లి పరమేశ్వరరావు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. సాయి హర్షిత గత ఏడాది ఇంటర్‌లో 948 మార్కులతో కాలేజ్ టాపర్‌గా నిలిచిందని, ప్రస్తుతం గుడ్లవల్లేరు కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు పెడన దేవాంగ యూత్ సేవా సమితి దృష్టికి తీసుకొచ్చారని మున్సిపల్ మాజీ చైర్మన్, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ అన్నారు. సేవా సమితి వారు ఏలూరులో దేవాంగ కల్యాణమండపం అడ్మిన్ అయినటువంటి పరమేశ్వరరావును స్పందించి ఆర్థిక సాయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి శివశంకర్, కాలపు సూరిబాబు, దేవాంగ యూత్ సేవా సమితి అధ్యక్షుడు సుధీర్‌కుమార్, వీరకోట సుబ్రహ్మణ్యం, కోటయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



కైకలూరు 8వ వార్డులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. కైకలూరు పంచాయతీ 8వ వార్డులో ఉపాధి పథకం నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.28 కోట్ల నిధులతో రహదారులను నిర్మిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పూలా రాజీ, కొల్లి బాబీ, పేరిచర్ల ప్రసాదరాజు, వార్డు సభ్యులు మేడూరి నాంచారయ్య, కేవీఎస్ఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చటాకాయ బాధితులకు న్యాయం జరిగేనా?

రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు



రక్షణ కల్పించాలని కోరుతున్న బాధితుడు సైదు రఘు దంపతులు

కైకలూరు: సభ్య సమాజం తలదించుకునేలా చేతబడి నెపంతో ముగ్గురిపై పాశవిక దాడి చేసిన కేసులో బాధితులకు న్యాయం జరిగేనా? అనే ప్రశ్న తలెత్తుతోంది. మండలంలోని చటాకాయ గ్రామంలో గత నెల 26న చేతబడి చేశారనే నెపంతో సైదు రఘు, మోరు రాంబాబు, జయమంగళ ధనుంజయపై గ్రామంలో 18 మంది కలిసి కట్టేసి చిత్రహింసలకు గురి చేశారు. కాళ్లు, చేతులు పని చేయని విధంగా కొట్టడంతో ఇద్దరు ఏలూరు ఆస్పత్రిలో చికిత్స పొందారు. రఘు తప్పించుకుని మంగళగిరి టీడీపీ కార్యాలయంలో తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. అక్కడి నుంచి ఏలూరు జిల్లా అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు అందాయి. ఈ ఘటనలో ఆరుగురిపై కైకలూరు రూరల్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గత నెల 29న కేసు నమోదు చేసినా నిందితులపై చర్యలు తీసుకోపోవడంతో తనకు ప్రాణహాని ఉందని రూరల్ పోలీసులకు ఆదివారం ప్రధాన బాధితుడు సైదు రఘు రెండోసారి ఫిర్యాదు చేశాడు. దాడి చేసిన 18 మందిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. గ్రామంలో పెద్దలు తనకు జరిగిన అన్యాయంపై మాట్లాడుతూ సాక్షిగా ఉన్న వ్యక్తిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొల్లేరు గ్రామాల్లో కట్టుబాట్ల నడుమ ప్రజల స్వేచ్ఛకు భంగం కలగడంపై కొందరు ముందుకు వస్తున్నా పెద్దలు అడ్డుపడుతున్నారు. చేతబడి, భూతవైద్యం వంటి మూఢనమ్మకాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు సామాజికవేత్తలు కోరుతున్నారు. గ్రామంలో దారుణానికి పాల్పడిన వ్యక్తులను మందలించకుండా కూటమి నేతల్లో కొల్లేరు నాయకుడు ఒకరు రాజీ చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నాడని తెలుస్తోంది. జిల్లా కలెక్టర్, ఎస్పీ గ్రామంలో విచారణ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో గతంలోనూ ఇలాంటి సంఘటనలు జరిగాయి. జిల్లా అధికారులు, పోలీసు బెటాలియన్ గ్రామంలో పర్యటించి ప్రజల్లో భయాన్ని తొలగించాల్సిన బాధ్యత ఉందని భావిస్తున్నారు.

స్పందించని ఎమ్మెల్యే..
ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్పందించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కొల్లేరు గ్రామాల్లో పూర్వం చేతబడి పేరుతో అనేక మంది నోటి పళ్లు ఊడగొట్టిన ఘటనలు చటాకాయలో జరిగాయి. బాధితుడు రఘు గ్రామంలోకి రాలేక బయట ప్రాంతాల్లో తలదాచుకుంటున్నాడు. ఎమ్మెల్యే గ్రామంలో వాస్తవ విషయాలపై స్పందించి నిందితులకు శిక్ష పడేలా చేయాలని పలువురు కోరుతున్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ



అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తులు తమ మొక్కుబడులను భక్తిప్రపత్తులతో తీర్చుకున్నారు. ఆదివారం దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్న సమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయ లక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

నిరు పేదలకు అన్నదానం
గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యాన అంగలూరులో నిరు పేదలకు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. త్రిపురనేని అప్పారావు స్మారకార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి. ప్రసాద్, గుడ్లవల్లేరు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

నిమ్మకూరు(పామర్రు): కార్తికక మాసం పురస్కరించుకుని మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పామర్రు గ్రామానికి చెందిన మల్లంపల్లి వెంకట శేషగిరిరావు, తులసీరామ్‌ల జ్ఞాపకార్థం మల్లంపల్లి సీతామహాలక్ష్మి స్థానిక గాంధీనగరానికి చెందిన శ్రీ లలితాదేవి భక్త బృందం సభ్యులచే ముందుగా లలితా సహస్ర నామ పారాయణ, భక్తి రంజనీ నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులు అందరికీ స్వామి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈనేపథ్యంలో ఆలయంలో స్వామివారికి విశేషంగా పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు యోగానందం లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద సేవ ట్రస్టు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు అవినీతిని వ్యతిరేకించాలని స్థానిక లేడియాంప్టిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి. సుందరలక్ష్మి సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ప్రతినిధులు విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుందరలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థినులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బెల్ కంపెనీ విజిలెన్స్ అధికారి కె.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సమాజంలో అవినీతికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అందరూ భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎల్.హరనాథ్‌బాబు, అధ్యాపకులు మమత, హిరణ్మయి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలి

ముదినేపల్లి రూరల్: రబీ సీజన్ వస్తున్న నేపథ్యంలో మండలంలోని రైతులకు సబ్సిడీపై అపరాల విత్తనాలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు కోరారు. ముదినేపల్లిలో ఆదివారం మాట్లాడుతూ మరో పది రోజుల్లో ముందుగా నాట్లు వేసిన, వెదజల్లిన వరిచేలు కోతకు రానున్నట్లు చెప్పారు. అనంతరం రైతులు మినుము, పెసర వంటి పైర్లను సాగు చేస్తారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు చెప్పారు. ఇలాంటి రైతులకు అపరాల విత్తనాలు ఉచితంగా సరఫరా చేయడంతో పాటు మిగిలిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయగా ప్రస్తుతం ఇందుకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రైస్తవులు సంఘటితంగా ఉండాలి

పామర్రు: క్రైస్తవులు సంఘటితంగా ఉంటే సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవచ్చని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల అన్నారు. స్థానిక గుడివాడ రోడ్డులోని పీటీపీఎఫ్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి క్రైస్తవుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీని కోసం అందరం కలిసి కట్టుగా ఉంటూ సమస్యల సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. క్రైస్తవులకు ప్రత్యేకంగా శ్మశాన వాటికల ఏర్పాటుకు స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని కోరారు. పాస్టర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా గౌరవ వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, రుణాలను ఏర్పాటు చేసి క్రైస్తవులను ఆదుకోవాలని అన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు టీ షాలేంరాజు, ఎం.శామ్యుల్, కె.ఇమ్మానియేల్, ఎజాన్ మోజేస్, ఏ ఆదాము తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న టిప్పర్



మచిలీపట్నంటౌన్: కొద్ది నెలల క్రితం కొండరాళ్లతో వస్తున్న టిప్పర్ సెంట్రల్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన మరువక ముందే ఆదివారం మరో టిప్పర్ డివైడర్‌ను ఢీకొంది. కంకర లోడ్‌తో వస్తున్న టిప్పర్ డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఇంజిన్ దెబ్బతింది. ఈ ప్రాంతంలో పాఠశాలలు ఉండటంతో ప్రతిరోజు విద్యార్థులు రోడ్డు దాటుతూ ఉంటారు. ఆదివారం కావటంతో రద్దీ లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు: నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల పంచాయతీ రాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గుంటలు లేని రహదారుల ఏర్పాటే లక్ష్యంగా రూ.3.5 కోట్ల నిధులతో గుంతలు పూడ్చే పనులు చేయిస్తామన్నారు. నియోజక అభివృద్ధికి రూ.1.30 కోట్లు నిధులు మంజూరయ్యాయని, గ్రామీణ ప్రాంతాలలో పూర్తిగా పాడైపోయిన రహదార్లను పునర్నిర్మిస్తామన్నారు. జనసేన నియోకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, పీఆర్ డీఈ సురేష్‌బాబు, ఏఈలు రామారావు, శరాబంది, పృధ్వీరాజ్, రామ్మోహన్‌రావు, వాసు దేవరావు పాల్గొన్నారు.

920 మందికి వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 540 మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు కణితి శిరేఖ, హనుమకొండ దుర్గా భవాని, గుండె, ఊపిరి తిత్తులు తదితర వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగంశెట్టి వర్దన్, సాధారణ వైద్యానికి హోమియో వైద్యురాలు పి.భవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాదుకు చెందిన డాక్టర్ హరిహర్ తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

380 మందికి ఉచిత వైద్య పరీక్షలు
గుడివాడ టౌన్: రోటరీక్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్ లోని ప్రతిభా గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో కీళ్లు, ఎముకలు, ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. సుమారు 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ సి.చంద్రశేఖరరావు, క్లబ్ అధ్యక్షుడు టీఎస్.రాజశేఖర్, గంట చంద్రశేఖర్, ప్రసాద్, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యబృందం, తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ చంటిబాబు

గుడివాడరూరల్: చెడు నడత, ప్రవర్తన కలిగిన వారు తీరు మార్చుకుని నేరాలకు దూరంగా క్రమశిక్షణతో జీవించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలో చెడు నడత కలిగి ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు, చెడునడత ఉన్న వ్యక్తులు నేరాలను వదిలి స్వేచ్ఛగా జీవించాలన్నారు. చెడు ప్రవర్తన మార్చుకోకపోతే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దొంగతనాలు, గొడవలు, అక్రమ మద్యం అమ్మకాలు, మాదకద్రవ్యాల అమ్మకాల వంటివాటితో పాటు కోతముక్క, కోడి పందేలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానిత వ్యక్తులపై పోలీసు నిఘా ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని వలివర్తిపాడు బైపాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీలను చేపట్టారు. వాహనాల రికార్డులు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు, రికార్డులు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని సూచించారు. లైసెన్స్‌లు లేని వారిపై అపరాధ రుసుం విధించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలు పాటించి తమకు సహకరించాలని ఎస్ఐ చంటిబాబు కోరారు.

మైనర్ల డ్రైవింగ్‌తో భయాందోళన

పెడన: మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలను నడుపుతూ తోటి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సరిగ్గా డ్రైవింగ్ వచ్చో...రాదో తెలియదు...ఎటుగా వెళ్తున్నారో చూస్తుండానే దూసుకు పోతున్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదు. 18 సంవత్సరాలు నిండిన వారికి ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని చట్టం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కొందరు బాలురు ద్విచక్ర వాహనాలతో ప్రధాన రహదారులపైకి వచ్చేస్తున్నారు. ఇటు పోలీసులు కూడా వీరి గురించి అస్సలు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా పురవీధుల్లో తిరుగుతూ పాదచారులను, ఇతర ద్విచక్ర వాహనదారులను మరింత భయాందోళనలకు, గురిచేస్తున్నారు.